## జపాన్ పరిశోధన పర్యటనకు హెచ్‌సీయూ ప్రొఫెసర్ వైదీశ్వరన్ ఎంపిక



కొండాపూర్, మే 29 : జపాన్‌లోని ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ (ఎన్ఐఎంఎస్)లో జరిగే పరిశోధన పర్యటనకు హైదరాబాద్ సెంట్రల్ యూ నివర్సిటీ ప్రొఫెసర్ జీఎస్ వైదీశ్వరన్ ఎంపికయ్యారు. వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వైదీశ్వరన్ మెటీరియల్స్ సైన్స్‌లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మెటీరియల్స్ నానో ఆర్కిటిక్టానిక్స్ (ఏంఏఎన్ఏ) స్కీమ్ కింద జపాన్ పరిశోధన పర్యటనకు ఎంపికైనట్లు వర్సిటీ యాజమాన్యం తెలిపింది. ఐదు వారాలపాటు కొనసాగే పర్యటన జనవరి 13, 2026 నుంచి ఫిబ్రవరి 20 వరకు కొనసాగుతుందన్నారు. ఈ పర్యటన ద్వారా వైదీశ్వరన్ పరిశోధనలతో పాటు నిమ్స్ యూనివర్సిటీతో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన విద్యార్థుల మాస్టర్స్, పీహెచ్డీల ప్రోగ్రామ్స్ పరస్పర ఎక్సేంజ్, కొలాబరేషన్లకు మెరుగైన అవకాశాలు పెరుగుతాయన్నారు.

## బైక్ ఢీకొని మహిళ మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 29: రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండా పీజేఆర్‌నగర్‌కు చెందిన బాలకృష్ణమ్మ కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో హౌస్ కీపింగ్‌గా పనులు చేస్తుంది. రోజు మాదిరిగానే గురువారం రెమిడి వైద్యశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా... యాక్టివా బైక్ అతివేగంగా ఆమెను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆమెను వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. బైకు నడిపిన వ్యక్తి సైఫ్‌ను అదుపులోకి తీసుకొని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయండి

- రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి..
- ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందు కు సిద్ధంగా ఉండాలి..
- ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి..
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 29 : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో ఆయన.. కుత్బుల్లాపూర్, గాజుల రామారం ఉప కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులతో వివిధ డివిజన్లు, కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని సమాయత్తం చేస్తూ అధికారులు సిద్ధంగా ఉండాలని, అలాగే వివిధ కాలనీలు, బస్తీల్లో కొనసాగుతున్న రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

### నూతన పనులకు ప్రణాళికలు రూపొందించండి

జంట సర్కిళ్లలోని బస్తీల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వివిధ డివిజన్లలో అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీల్లో పిల్లలు, పెద్దలకు ఆహ్లాద భరితంగా ఉన్న పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఓపెన్ జిమ్‌ల నిర్వహణ, ప్రహరీ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలన్నారు. జంట సర్కిళ్ల పరిధిలోని శ్రీనివాస్‌నగర్, కళావతినగర్, దేవేందర్‌నగర్, భగత్‌సింగ్ నగర్, పద్మానగర్ ఫేస్– 1 కాలనీల్లోని శ్మశానవాటికలను ఆధునీకరించి మోడ్రన్ గ్రేవ్ యార్డ్ నిర్మించాలని సూచించారు. మోడల్ మార్కెట్లు ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా 100% వినియోగించాలని, అవసరమైనచోట కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.

జగద్గిరిగుట్ట అవుట్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, జగద్గిరిగుట్ట చివరి బస్టాప్‌లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సుల్లోని సిబ్బంది కోసం విశ్రాంతి గదులు, టాయిలెట్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పరికచెరువులో మురుగునీరు కలవకుండా శుద్ధీకరణ చర్యలు చేపట్టి చెరువును సుందరీకరించాలని అన్నారు. చింతల్ డివిజన్, భగత్‌సింగ్ నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నా పనులను చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని సూచించారు.

### ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తేవాలి

సూరారం డివిజన్, టీఎస్ఐఐసీ కాలనీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు.. సుభాష్ నగర్ డివిజన్, రాజీవ్ గృహకల్పనుంచి ఎస్ఆర్ నాయక్ నగర్ వరకు నా లా పనులను అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మించాలన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు అధికంగా ఉన్న చింతల్ మెయిన్ రోడ్‌లో పాదచారులు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని సూచించారు. పాపయ్య యాదవ్ నగర్ నుంచి బాలానగర్ బీబీఆర్ ఆసుపత్రి వైపుగా వెళ్ళే నాలా విస్తరణ పనులను చేపట్టే విధంగా కూకట్‌పల్లి సర్కిల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలని, తద్వారా కుత్బుల్లాపూర్‌లో వరద ప్రవాహం సాఫీగా సాగుతుందని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాలని, ఈ పథకాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన డివిజన్ వార్డు ఆఫీసుల్లో నిర్ణీత సమయాన్ని నిర్దేశించి అధికారులు, సిబ్బంది ఉండి ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, విజయశేఖర్‌గౌడ్, రషీదా మహమ్మద్ రఫీ, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సురేశ్ రెడ్డి, కెఎం.గౌరీశ్, ఇంజినీరింగ్ విభాగం ఈఈలు లక్ష్మీ గణేశ్, కిష్టప్ప, డీఈలు పాపమ్మ, శిరీష, రూపాదేవి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కల్యాణం... కమనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి దశమ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన వేంకటేశ్వరస్వామివారి కల్యాణ వేడుకలు కనుల పండుగసాగాయి. ఈ సందర్భంగా శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. – *కేపీహెచ్‌బీ కాలనీ, మే 29*

## వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవం



గాజుల రామారం డివిజన్, మితులానగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. – *దుండిగల్, మే 29*

## అధిక యూరియాతో పంటల్లో దుష్ప్రయోజనాలే అధికం..

### వ్యవసాయ శాస్త్రవేత్త డా. శ్రీలత

దుండిగల్, మే 29: పంటల్లో అధిక యూరియా వినియోగం వల్ల దుష్ప్రయోజనాలే కలుగుతాయని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా. సిహెచ్.శ్రీ లత అన్నారు. గండి –మైసమ్మ దుండిగల్ మండలం, బౌరంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఎసీఎస్) కార్యాలయంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలత భూసార పరీక్షల నిర్వహణ, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకతపై రైతులకు వివరించారు. సేంద్రియ , జీవన ఎరువులు వాడకంతోను అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డితో పాటు డైరెక్టర్లు భీమ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డా. శ్రీలత

## ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

బాలానగర్, మే 29 : ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేయాలని రైల్వే అధికారులకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. గురువారం ఆయన ఫతేనగర్ రైల్వే స్టేషన్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే అధికారులు ప్రజల అవసరాలను తీర్చడంపై దృష్టి సారించాలని అన్నారు. ఫతేనగర్ రైల్వే స్టేషన్లో ఫతేనగర్ వైపు మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. రైల్వే స్టేషన్లో ఇరువైపులా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆ దిశగా రైల్వే అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు సూచించారు.




ఆర్ఓబీ మెట్ల మార్గం ద్వారా నడుస్తూ గాయాల పాలు కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫతేనగర్ మాజీ కార్పొరేటర్ ముద్దాపురం కృష్ణ గౌడ్, స్థానిక నాయకులు రాములు, గోపి, ఉదయ్, యాదగిరి, నరేశ్, బాణేశ్, ప్ర మోద్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, దశరథ్, సాగర్ కృష్ణ, రాజు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు దుస్తువుల పంపిణీ

కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కొడుకు శివ అభిషేక్‌రావు, కోడలు దివ్యల చేతుల మీదుగా గురువారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. – *కేపీహెచ్‌బీ కాలనీ, మే 29*

## సేవా భారతి ట్రస్ట్ సేవలు అభినందనీయం



గత కొన్ని సంవత్సరాలుగా సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు గాజుల విజయ్ కుమార్ కొనియాడారు. విజయ్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్‌కు గురువారం లక్ష రూపాయల చెక్కును సేవా భారతి వ్యవస్థాపకులు బైరెడ్డి సూర్యనారాయణకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దుత్త రవీంద్రనాథ్ ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు. – *అల్లాపూర్, మే 29*

## నాలా విస్తరణ పనులు ప్రారంభించాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

అల్లాపూర్, మే 29: సున్నం చెరువు ఎగువ నుంచి మైసమ్మ చెరువుకు దిగువకు ప్రవహిస్తున్న నాలా విస్తరణ పనులు ప్రారంభించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం కోరారు. గురువారం మూసాపేట సర్కిల్ –23 డిప్యూటీ కమిషనర్ వంశీ కృష్ణతో కలిసి కార్పొరేటర్.. రాజీవ్ గాంధీ నగర్‌లో నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముంపు సమస్య తలెత్తకుండా ఉండాలంటే నాలా విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, షేక్‌రఫీక్, సలీం, అస్లం, మల్లేశ్, షఫీ, మహమ్మద్, గౌస్ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు ఇబ్బందులు లేకుండా చేయాలి ..

మాదాపూర్, మే 29: చందానగర్ రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు ఇటు, అటు దాటేందుకు ఇదివరకు లిఫ్ట్ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చేయడం సంతోషంగా ఉందని హుడాకాలనీ సీనియర్ సిటిజన్స్ తరపున వి. ప్రభాకర్ రావు పేర్కొన్నారు. అలాగే.. రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు లగేజీతో సులభంగా ఇవతలి వైపునుంచి అవతలి వైపు వెళ్లేటట్టుగా ఏర్పాట్లు చేయాలని గురువారం ఆయన.. జనరల్ మేనేజర్ సౌత్ సెంట్రల్ రైల్వేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...హుడా కాలనీ, చందానగర్ రైల్వేస్టేషన్‌లో మెట్రో రైలులో ఏర్పాటు చేసినట్టు వృద్ధులు ఇవతలి నుంచి అవతలికి సులభంగా లగేజీలతో ప్ర యాణం చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం వృద్ధులు, వికలాంగులు ఇటు నుంచి అటుగా లగేజీలతో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయనతెలిపారు. ఇప్పటికైనా సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులను గుర్తించి.. సమస్య ను పరిష్కరించాలని ఆయన కోరారు.

## కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 29: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.13, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 31, కాలీఫ్లవర్ 23, దొండ 15, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలుగడ్డ 24, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 12, పొట్లకాయ 23, కందగడ్డ 65, ఉల్లిపొరక 60, ఉల్లిగడ్డ 19, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## సిప్లాన్ ఫార్మా పరిశ్రమపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు..

### రూ.3 లక్షల ఔషధ నిలువలు స్వాధీనం

దుండిగల్, మే 29: డ్రగ్స్ కంట్రోల్ అడ్మిషన్ (ఔషధ నియంత్రణ మండలి)అధికారులు గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతినగర్ సమీపంలోని అలీఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న సిప్లాన్ డ్రగ్స్ అండ్ ఫార్మసూటికల్స్ లిమిటెడ్ పరిశ్రమ, యూనిట్ –1 పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దాడుల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న వెటర్నరీ ఔషధాలను గుర్తించారు. సుమారు రూ.3 లక్షల విలువచేసే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ 250 ఎంజీ (వెటర్నరీ),986 కేజీల ఆల్బెండజోల్ గ్రాన్యూయేల్స్(వెటర్నరీ) నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వీటికి బోలసెస్, గ్రాన్యూయేల్స్ లైసెన్స్ లేకుండానే తయారు చేయడంతోపాటు, మార్కెట్లో విక్రయాలు చేపడుతున్నట్లు తేలిందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డ్రగ్ కంట్రోల్ ఏడీ ప్రభాకర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, విక్రమ్, నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన ఔషధ నిలువలతో మండలి అధికారులు



## బాలానగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి


బాలానగర్, మే 29 : బాలానగర్ ఫ్లైఓవర్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన.. మూసాపేటలోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో కమ్యూనిటీ హాల్, దిల్‌కుష్‌నగర్‌లో వరదనీటి పైప్‌లైన్, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరారు. బాలానగర్ ఫ్లైఓవర్ వద్ద ప్రమాదాల నివారణకు ఫుటోవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

## నేడు జీడిమెట్లలో డయల్ యువర్ డీఎం

జీడిమెట్ల, మే 29 : ఈ నెల 30న సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని జీడిమెట్ల డిపో పరిధిలో చేపడుతున్నట్లు డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. జీడిమెట్ల పరిసర ప్రాంతాల్లో టీజీఎస్ఆర్టీసీ సంబంధించిన ఎటువంటి ఇబ్బందులు ఉన్నా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 9959226150 కు ఫోన్ చేసి సమస్యను మా దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

## హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం

అల్లాపూర్, మే 29: మోతీనగర్ కో– ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో 9 మంది కార్యవర్గ సభ్యులు గెలుపొందారని ఎన్నికల అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షురాలుగా పి.సుధారాణి, కార్యదర్శిగా బి.సీతా రామయ్య, కోశాధికారిగా పీఏఎస్ మూర్తి, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్.అంజిరెడ్డి, ఆర్.శ్రీనివాసన్, వి.రుక్మిణి, కె.తులసీదాస్, కె.శ్రీనివాసరావు లు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల అథారిటీ అడిషనల్ రిజిస్టర్ శ్రీనివాసరావు సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



## టీజేఎఫ్ 25 వసంతాల రజతోత్సవ సంబురాల పోస్టర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్, మే 29: నగరంలోని నెక్లెస్‌రోడ్డులో ఈ నెల 31న నిర్వహించనున్న టీజేఎఫ్ 25 వసంతాల సంబురాల పోస్టర్ ఆవిష్కరణను యూనియన్ నేతలు గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడి ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల రజతోత్సవ సంబురాలను నిర్వహించుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్ –143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షు డు సుధీర్ మహంకాళి, పలువురు విలేకరులు, జగన్, విజయ్, శేఖర్ గౌడ్, రషీదా మహమ్మద్ రఫీ, మంత్రి సత్య నారాయణ, సురేశ్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



టీజేఎఫ్ 25 వసంతాల పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

మియాపూర్, మే 29: చందానగర్ సర్కిల్ పరిధిలో ఓ అక్రమ నిర్మాణ భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సర్కిల్ పరిధి, హఫీజ్ పేట డివిజన్, మదీనాగూడలోని ఓ అక్రమ నిర్మాణ భవనంలో గురువారం పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఓ కార్మికుడు గోవా కర్రలు కూలి లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ అధికారులు సదరు భవన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మియాపూర్ పోలీసులకు లేఖ రాశారు. కార్మికుడి బంధువులు సైతం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## తల్లి, కూతురు అదృశ్యం



బాలానగర్, మే 29 : తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం... కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి, రంగారెడ్డి నగర్‌లో నివాసం ఉండే సీత (21).. తన మూడేళ్ల కుమార్తె జాహ్నవి ను తీసుకొని బుధవారం ఉదయం 9 గం టలకు డ్యూటీకి అని వెళ్లి.. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మొత్తం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నివాసాల మధ్య మేకల పెంపకం వద్దు

కొండాపూర్, మే 29 : నివాసాల మధ్య మేకల మందను ఉంచుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ చందానగర్ సర్కిల్ –21 పరిధిలోని హుడా ఫేజ్ –2 వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చందానగర్‌లోని సంకల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు మేకలను పెంచుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్య మేకల మందలు ఉండటంతో కంపు వాసన వస్తుందని, సంకల్ప్ ఫౌండేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని తమ ఇష్టానుసారంగా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందిం చి మేకల మం దను ఇక్కడి నుంచి తొలగించేసేలా చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.